క్లుప్తంగా

రమేశ్‌యాదవ్‌కు సన్మానం


రమేశ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న తీన్మార్ మల్లన్న

మునిపల్లి(అందోల్): రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రమేశ్‌యాదవ్‌ను తీన్మార్ మల్లన్న శాలువాతో సన్మానించారు. మంగళవారం హైదరాబాద్‌లో మల్లన్న రమేశ్‌యాదవ్‌ను కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన గెలుపునకు కృషి చేసిన సందర్భంగా సన్మానించినట్లు తెలిపారు.

పశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి


పశువులకు టీకా వేస్తున్న డాక్టర్ పాండియన్

రాయికోడ్(అందోల్): పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ పాండియన్ అన్నారు. మండలంలోని జంమ్గి గ్రామంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలు, పశుసంవర్ధక శాఖ అందిస్తున్న సేవలు తదితర వివరాలపై పశుపోషకులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని 104 ఆవులు, ఎద్దులు, 43 లేగ దూడలు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది దేవిదాస్, ఘని, మైనొద్దీన్, పశుపోషకులు ఉన్నారు.

అర్థమయ్యేలా బోధించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న భీమ్‌సింగ్

మునిపల్లి(అందోల్): విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని ఎంఈఓ భీమ్‌సింగ్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దచల్మెడ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాస్‌లు తీసుకుని అర్థం కాని సబ్జెక్టులను బోధించాలన్నారు. పదిలో అధిక మార్కులు సాధిస్తామని ఆత్మవిశ్వాసం ఉండాలని విద్యార్థులకు సూచించారు. క్రమపద్ధతిలో ఏ రోజు ఏ సబ్జెక్టు చదవాలో పూర్తిస్థాయిలో విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ స్థాయి ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఉపాధ్యాయులు సోమలింగం, దుర్గయ్య, కృష్ణకుమారి, సూరజ్, అమ్రమ్మ, రవీందర్, అజయ్‌కుమార్, కిష్టయ్యతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

కేతకీలో ప్రత్యేక పూజలు


పూజల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో మంగళవారం ఎక్సైజ్ శాఖ మెదక్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్, జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అధికారి నవీన్‌చంద్ర ఇతర అధికారులతో కలిసి పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి, పూలమాలలు, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, వీరన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి సన్మానం


ఎంపీని సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

నారాయణఖేడ్: జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను సీపీఐ జిల్లా నాయకులు చిరంజీవి నారాయణఖేడ్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయా రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. కాంగ్రెస్ ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నెహ్రూనాయక్, సామాజిక ఉద్యమకారులు నర్సింహులు, చందర్ ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం

రోడ్డెక్కిన విద్యార్థులు

- కలెక్టరేట్ వద్ద బీసీ విద్యార్థి, ఏబీవీపీ నాయకుల ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘాలు, ఏబీవీపీ నాయకులు రోడ్డెక్కారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులు కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్, సాల్కర్‌షిప్‌పై ఆధారపడే ఉన్నత విద్యను అభ్యసిస్తారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో వారికి ఉన్నత విద్యను దూరం చేసినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళనకు కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమైన ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడం దారుణమన్నారు. వెంటనే రూ.4 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని లేకుంటే ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా రీయింబర్స్‌మెంట్‌పై దాటవేస్తూ.. కాంట్రాక్ట్ పద్ధతిలో చెల్లింపులంటూ నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. చాలా మంది విద్యార్థులు సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు పొందలేక ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇతర రాష్ట్రాల్లో విద్యార్థులకు రూ. 20 వేలు, రూ. 15 వేలు స్కాలర్‌షిప్ ఇచ్చి ఆదుకుంటున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో రూ. 5500 ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారని విమర్శించారు. అనంతరం డీఆర్వో పద్మజరాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు భాషా, మహేశ్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆకాష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణతో ఉద్యోగాలు


మాట్లాడుతున్న టాస్క్ ట్రైనర్ ప్రవీణ్

జహీరాబాద్ టౌన్: నైపుణ్యాభివృద్ధి శిక్షణతో మంచి ఉద్యోగాలు వస్తాయని టాస్క్ ట్రైనర్ ప్రవీణ్ అన్నారు. పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో పలు మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు సంపాదించాలంటే ఇంటర్వ్యూ, స్కిల్స్ ముఖ్యమన్నారు. శిక్షణతో విద్యార్థులు నైపుణాభివృద్ధి పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్, డైరెక్టర్లు వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కళాశాల టాస్క్ కోఆర్డినేటర్ నర్సింలు, అధ్యాపకులు నిఖిత, దీపక, నందుగౌడ్, నవీన, శ్వేతలు పాల్గొన్నారు.

‘ఇంటిగ్రేటెడ్’ అందుబాటులోకి తీసుకురావాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు, వ్యాపారస్తులు

సంగారెడ్డిజోన్/జహీరాబాద్‌టౌన్ : జహీరాబాద్‌లో రూ.11కోట్ల వ్యయంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని బీఆర్ఎస్ నాయకులు, వ్యాపారస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో అడిషన్ కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారులు నిర్వహించిన వేలం పాటలో తాము రుసుము చెల్లించి, 20 నెలలు గడుస్తున్నా తమకు దుకాణాలు అప్పగించడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రతి నెలా వచ్చే ఆదాయం కోల్పోవాల్సి వస్తుందన్నారు. త్వరితగతిన అధికారులు చర్యలు తీసుకుని మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు నామరవికిరణ్, శివప్ప, నరేష్‌రెడ్డి, సందీప్, వ్యాపారస్తులు సుభాష్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లపై రైతులకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

జిన్నారం (పటాన్‌చెరు): ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులతో మంగళవారం వ్యవసాయ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలోని కానుకుంట రైతు వేదికలో వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సన్నవరి ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతాన్ని 17 శాతం మించకుండా ప్యాడీ క్లీనర్‌లో వేసి కేంద్రానికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఏ గ్రేడ్ ధాన్యానికి, సన్నాలకు రూ.2320, సాధారణ రకానికి రూ.2300లతో అదనంగా రూ.500 రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల రిజిస్టర్‌లో వ్యవసాయ విస్తరణ అధికారి టోకెన్ జారీ చేసిన ధాన్యాన్ని మాత్రమే తూకం వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఐకేపీ, ఏపీఎం శివకుమార్, ఏఈఓ ప్రణవి, సీసీ కృష్ణ, బీఓఏలు కల్పన, మహేశ్వరి, కమిటీ సభ్యులు రైతులు వెంకటేష్ గౌడ్, మల్లారెడ్డి, బాలారెడ్డి, భిక్షపతి, మహేశ్, రాజు,రాజిరెడ్డి పాల్గొన్నారు.

సిర్గాపూర్‌లో బంద్


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల కేంద్రంలో మంగళవారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. హిందూ దేవాలయాలను ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. హిందూ సంస్కృతిని కాపాడేందుకు ప్రజంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మునిపల్లి(అందోల్): పెండింగ్ పీఆర్సీ, డీఏలను వెంటనే చెల్లించాలని తాటిపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తాటిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విరామ సమయంలో తపస్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులంతా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల నిరసన

నారాయణఖేడ్: పెండింగ్ డీఏ, పీఆర్సీని వెంటనే చెల్లించాలని మంగళవారం ఖేడ్ మండలం రుద్రారం, ర్యాలమడుగు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని ప లు పాఠశాలల్లోనూ నిరసనలు నిర్వహించారు.

పెండింగ్ డీఏ చెల్లించాలి

జహీరాబాద్ టౌన్: పెండింగ్ డీఏ, పీఆర్సీని వెంటనే చెల్లించాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

నూతన నియామకం

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా గౌసాబాద్‌కు చెందిన సంజీవ్‌రెడ్డి నియమితులైయ్యారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు నియామకపత్రాన్ని అందజేశారు.

లీగల్ అవేర్నెస్ క్యాంపులు


మాట్లాడుతున్న ప్యానెల్ అడ్వకేట్ సోమశేఖర్

జహీరాబాద్ టౌన్: మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పలుచోట్ల లీగల్ అవేర్నెస్ క్యాంపులను నిర్వహించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్యానెల్ న్యాయవాది సోమశేఖర్ మహిళా చట్టాలు, బాల్య వివాహాలు, బాల కార్మికుల చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాలను ఉల్లఘించిన వారిపై 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పీఎల్‌వీ ఈశ్వరమ్మ, మహిళలు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని హుగ్గెల్లి రైతు వేదికలో నిర్వహించిన క్యాంపులో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మన్నెన్న వృద్ధుల సంరక్షణ చట్టం గురించి వివరించారు. క్యాంపులో ప్యానెల్ అడ్వకేట్ రుద్రయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: ఝరాసంగం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు మంగళవారం రూ. 3.31 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని జొన్నగామకు చెందిన విఠల్‌కు రూ.27 వేలు, సిద్దాపూర్ నర్సప్పకు రూ. 33 వేలు, కొల్లూర్‌కు చెందిన ప్రేమకు రూ. 43,500 వేలు, కంబాలపల్లికి చెందిన బిక్కుసాబ్‌కు రూ.39 వేలు, తుమ్మన్‌పల్లికి చెందిన యూనూస్‌కు రూ.23,500 వేలు, జీర్లపల్లికి చెందిన ఏసయ్యకు రూ. 37,500 వేలు, తుమ్మన్‌పల్లికి చెందిన అంజిరెడ్డికి రూ. 23,500 వేలు, కృష్ణపూర్ బిచ్చయ్యకు రూ.27 వేలు, బిడెకన్నకు చెందిన రంగమ్మకు రూ.27 వేలు, ఝరాసంగంకు చెందిన మమతకు రూ. 45 వేలు, ఇస్లాంపూర్‌కు చెందిన అరుణకు రూ. 54 వేల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గంజాయి నేరస్తులకు కౌన్సిలింగ్


కౌన్సిలింగ్ చేస్తున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): గంజాయి పాత కేసుల్లో నేరస్తులకు కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. నేరాలకు పాల్పడితే కొత్త చట్టాలు కఠినంగా ఉన్నాయని , పీడీయాక్టు కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు బుట్టల పంపిణీ


బుట్టలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్‌టౌన్: జహీరాబాద్ డీడీఎస్-కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఇంటెలగడ్డ, జీడిగడ్డ, సిద్దాపూర్ తండా మహిళా రైతులకు లింగాకర్షక బుట్టలు, వేప నూనె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త రమేష్ రైతులకు కంది పొలంలో సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. పంటకు మచ్చల పురుగు, శనగపచ్చ పురుగులు ఆశిస్తాయని, లీటర్ నీటిలో 5 మీ.లీ వేప నూనె కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు అమర్చాలని చెప్పారు. ఈ చర్యల వల్ల పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. 78 మంది రైతులకు 800 లింగాకర్షక బుట్టలు, 78 లీటర్ల వేప నూనె పంపిణీ చేశారు.

వరికొనుగోలు కేంద్రం ప్రారంభం

జోగిపేట(అందోల్): జోగిపేటలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మంగళవారం వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని రైతులే ప్రారంభించడం విశేషం. ఈ సందర్భంగా అందోల్ పీఏసీఎస్ సీఈఓ నరసింహులు మాట్లాడుతూ.. రైతులు వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు ధాన్యాన్ని వరి కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని సూచించారు.

ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి
కమ్మర్ ఫాతిమా భర్త పేరు మహమ్మద్ నజార్ వీరు పటాన్‌చెరు శాంతినగర్ కాలనీ సంగారెడ్డి జిల్లా వాస్తవ్యులు వీరికి చెందిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ నంబర్ 3163/2021 సర్వే నంబర్ 41/ఆ/1/1, 41ఆ/1/2 41/ఆ/1/3 41/ఆ/1/4 కి చెందిన ప్లాట్ నంబర్ 3,4,5 జహీరాబాద్ అల్లీపూర్ కి చెందిన emna2 colony సంబంధించిన డాక్యుమెంట్స్ పటాన్‌చెరు నుండి బస్సులో జహీరాబాద్ వస్తుండగా జహీరాబాద్‌లో పండగ తరువాత బస్‌స్టాండ్‌లో బస్సు దిగుతుండగా డాక్యుమెంట్స్ మిస్ అవ్వడం జరిగింది. కావున ఇట్టి డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికినచో ఇట్టి నంబరుకు సంప్రదించగలరు.
9440950558 MOHAMMED SAUD

ఆదివాసీల వేగుచుక్క కొమురం భీమ్

- కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్


నివాళులర్పిస్తున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కొమురం భీమ్ అని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. మంగళవారం కొమురం భీం జయంతి సందర్భంగా చిట్కుల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మధు మాట్లాడుతూ.. ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీ, దౌర్జన్యాలపై విరోచితంగా పోరాటం చేసిన ధీరుడు కొమురం భీమ్ అన్నారు. ఆదివాసీలపై నిజాం సర్కార్ పాశవిక చర్యలకు పాల్పడిన సందర్భంలో ‘జల్, జంగల్, జమీన్’ నినాదంతో భీకరంగా పోరాడి వీర మరణం పొంది ఆదివాసుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాడని కొనియాడారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, మురళీ, గోపాల్, శంకర్, రాఘవేంద్ర, రవి, విష్ణువర్ధన్, గోపాల్ పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణతో ఉపాధి

- మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ


సర్టిఫికెట్లు అందజేసిన అపర్ణ, గోపాల్

సదాశివపేట (సంగారెడ్డి): ఉచిత కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి లభిస్తోందని మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ పేర్కొన్నారు. మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తూ భవిష్యత్తుకు భరోసానిస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళకు మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బీఆర్ఎస్ నాయకుడు శివరాజ్‌పాటిల్ పద్మ,రమ, ప్రవీణ మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎన్ఎస్ఎస్ సేవలు అభినందనీయం

సంగారెడ్డి టౌన్ : గ్రామాల్లో జాతీయ సేవా పథకం కింద ఎన్ఎస్ఎస్ శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం అన్నారు. మండలంలోని పసల్వాది గ్రామంలో వారం రోజుల పాటు నిర్వహించిన జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామాల్లోని రైతులకు పంటల సాగుపై, సేంద్రియ ఎరువుల వాడకం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ఉపాధ్యాయులు నరేందర్ రెడ్డి, ఏరువాక కేంద్రం సమన్వయకర్త రాహుల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అమీర్ భాష, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ కంప్యూటర్ల పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ సహకారంతో మంగళవారం మొబిస్ హ్యుందాయ్ సంస్థ 50 కంప్యూటర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. మొబిస్ హ్యుందాయ్ సంస్థ సీఎస్ఆర్ నిధుల కింద తెల్లాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలకు 30కంప్యూటర్లు, ప్రాథమిక పాఠశాలకు 10, వెల్లిమెల జిల్లా పరిషత్ పాఠశాలకు 10 కంప్యూటర్లను అందజేయడం హర్షనీయమన్నారు.

◆ ఘనంగా ఉర్సు

సంగారెడ్డి టౌన్ : పట్టణ శివారులోని ఇర్ఫాని దర్గాలో ఉర్సు ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెండు రోజుల పాటు కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

◆ ‘బస్తీ దర్శన్’లో సమస్యలు పరిష్కారం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని పాత రామచంద్రాపురంలో మంగళవారం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ‘బస్తీ దర్శన్’ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ పుష్ప పాల్గొన్నారు. కాలనీలోని డ్రైనేజీ సమస్యను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్ప మాట్లాడుతూ.. గతంలో నూతన డ్రైనేజీ పైపులైన్ల కోసం ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

◆ గుంతల రోడ్డు పరిశీలన

జిన్నారం (పటాన్‌చెరు): గుంతలమయంగా మారిన మాదారం రోడ్డును ఆర్అండ్‌బీ అధికారులు మంగళవారం పరిశీలించారు. గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్‌తో కలిసి డీఈ రామకృష్ణ పరిశీలించారు. నిత్యం కంకర క్రషర్ల టిప్పర్లు రాకపోకలతో రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ధ్వంసమైన రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వివరించారు. రోడ్డుపైకి టిప్పర్లు రాకుండా రోడ్డును మూసివేశామన్నారు. దీంతో యాజమాన్యం రోడ్డు మరమ్మతులకు ముందుకు వచ్చారని తెలిపారు. త్వరలోనే పనులు చేపడతామని ఆర్అండ్‌బీ అధికారులు స్థానిక నాయకులకు చెప్పారు.

◆ కనీస వసతుల ఏర్పాటుకు కృషి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కనీస వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని సంగారెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే తారా ప్రభుత్వ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కళాశాల అధ్యాపక బృందం శాలువాతో సత్కరించింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో బాలికలకు ప్రత్యేక మూత్రశాలలు , కళాశాల కాంపౌండ్ వాల్ తదితర సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని తెలిపారు.

◆ జోగిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సంగమేశ్వర్

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిఫ్ కోర్టు పట్టణ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది సంగమేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.హరినారాయణవర్మ లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను న్యాయవాదులు సన్మానించి, అభినందించారు.

◆ ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వండి

పటాన్‌చెరు టౌన్: ప్రశ్నించే గొంతుకకు పట్టభద్రుల ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలంలోని ప్రైవేట్ విద్యా సంస్థల ఉపాధ్యాయులను కలిసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఓటు నమోదు అవశ్యకతను తెలుసుకోవాలని, అలాగే, ఓటు ప్రాధాన్యం గుర్తించాలన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి రూ.10 లక్షల ఆరోగ్య బీమా, జీవిత బీమా వచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చిస్తానని తెలియజేశారు.

◆ ఎంపీ దృష్టికి సమస్యలు

పటాన్ చెరు: కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడా సమస్యలను ఎంపీ రఘునందన్‌రావుకు వివరించినట్లు బీజేపీ అమీన్‌పూర్ మండలం అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎంపీ నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేట ప్రాంతాల్లో కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీల కొరత ఉందని వివరించారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపీని కోరారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 9 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

మత్స్యకారులకు మొండి చెయ్యి

జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి : మత్స్యకారుల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై చేపపిల్లలను పంపిణీ చేసిందని జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. కాని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు చేపపిల్లల పంపిణీపై స్పష్టత ఇవ్వ లేదని ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా కేంద్రాల్లో 50 శాతం మాత్రమే చేపపిల్లల పంపిణీ చేస్తున్నట్లు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో మాత్రం శూన్యమని మండిపడ్డారు. జూలైలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, చేపపిల్లలను పంపిణీ చేయాల్సి ఉంది. చెరువులకు చేప పిల్లలు చేరే అంశంపై ఇంకా సందేహాలు కనిపిస్తున్నాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టి కోసం ఎంతో ముందుచూపుతో వ్యవహరించిదన్నారు. చేప పిల్లల పంపిణీ మొదలవుతుందని సంఘాల నేతలు ఎదురు చూస్తున్నవారికి నిరాశే కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు, మురళీ, విఠల్, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400